కేజ్‌వీల్స్‌తో రోడ్డెక్కితే అంతే..

- మూడోసారి పట్టుబడితే వాహనం సీజ్
- పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్న అధికార యంత్రాంగం



కేజ్‌వీల్స్‌తో ధ్వంసమైన రోడ్డు



ఈనెల 4న పట్టుబడిన కేజ్‌వీల్స్ ట్రాక్టర్

సుల్తానాబాద్‌రూరల్: వ్యవసాయ పనుల కోసం కేజ్‌వీల్స్ అమర్చిన ట్రాక్టర్లతో రోడ్లపై నడుపుతుండటంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. వర్షాకాలం ప్రారంభం కావడంతో కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్ రోడ్డుపైకి వచ్చినప్పుడు రోడ్లు ధ్వంసం కావడంతో పాటు గుంతలు పడుతున్నాయి. దీంతో కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్డుపైకి రాకుండా అధికార యంత్రాంగం సమావేశాలు నిర్వహించడంతో పాటు గ్రామాల్లోని ట్రాక్టర్ల యజమానులకు నోటీస్‌లు పంపింది. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

సంయుక్తంగా అధికారుల చర్యలు..

కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్డుపైకి రాకుండా తహసీల్దార్, ఎంపీడీవో, ఏఏవో, పోలీసులు సంయుక్తంగా అవగాహన కల్పించడంతో పాటు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ప్రతీరోజు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, కార్యదర్శులు గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నారు. రోడ్డుపైకి వచ్చిన వారికి వెంటనే జరిమానా విధిస్తున్నారు.

మూడోసారి పట్టుబడితే వాహనం సీజ్..

కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్ రోడ్డుపై తిరిగితే మొదటిసారి రూ.5వేలు, రెండోసారి రూ.10వేలు, మూడోసారి పట్టుబడితే రూ.20వేల జరిమానా విధించడంతో పాటు వాహనం సీజ్ చేస్తామని అధికారులు తెలిపారు. ఎవరైన కేజ్‌వీల్స్‌తో రోడ్డెక్కితే వెంటనే పోలీసులకు, రెవెన్యూ, కార్యదర్శులకు సమాచారం అందించాలని వారు కోరారు.

ట్రాక్టర్ యజమానికి జరిమానా

సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూర్ గ్రామానికి చెందిన భూతగడ్డ చంద్రయ్య ఈ నెల 4న కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్ రోడ్డుపైకి రావడంతో పోలీసులు పట్టుకున్నారు. చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించగా మొదటిసారి తప్పుగా రూ.5వేలు జరిమానా విధించడంతో పాటు మళ్లీ తప్పు చేయనని రాయించుకొని పంపించారు.

వాహనం సీజ్ చేస్తాం



కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్ తిరిగితే జరిమానా విధించడంతో పాటు వాహనం సీజ్ చేస్తాం. ఇప్పటికే మండలంలోని ట్రాక్టర్ల యజమానులకు అవగాహన కల్పించడంతో పాటు నోటీసులు జారీ చేశాం.

– బషీరోద్దీన్, తహసీల్దార్, సుల్తానాబాద్

సమాచారం అందించాలి



నిబంధనలకు విరుద్ధంగా కేజ్‌వీల్స్‌తో రోడ్డుపైకి వస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు. కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం కావడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎవరైనా కేజ్‌వీల్స్‌తో రోడ్డుపైకి వస్తే సమాచారం అందించాలి.

– శ్రావణ్‌కుమార్, ఎస్సై, సుల్తానాబాద్

శిథిలావస్థలో జెన్‌కో క్వార్టర్లు



ఏ-కాలనీలో జెన్‌కో క్వార్టర్ల దుస్థితి

రామగుండం: బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం మూతపడడంతో జెన్‌కో ఉద్యోగులలో కొంతమందిని రెండు నెలల క్రితం యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన ఉద్యోగులు క్వార్టర్లు ఖాళీ చేసి వెళ్లిపోవడంతో మధ్య మధ్యలో ఖాళీ క్వార్టర్లు, మధ్యలో కొంతమంది ఉద్యోగులు నివాసం ఉండడంతో హౌస్ కీపింగ్ పనులు అంతంత మాత్రంగానే నిర్వహిస్తున్నారు. కాగా సదరు క్వార్టర్లు ఐదు దశాబ్దాల క్రితం నిర్మించడంతో ఇప్పటికే తలుపులు, కిటికీలు విరిగిపోగా పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. వర్షాకాలంలో గోడలు తడిసి వర్షపు నీరు లోనికి వస్తుండేది. భారీ వర్షాలకు క్వార్టర్ల ప్రాంగణం పూర్తిగా బురదతో నిండిపోయి, ప్రాంగణంలో పిచ్చిమొక్కలు పెరిగాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో పాటు విషప్రాణులు సంచరించే అవకాశం ఉండడంతో సమీపంలో ఉండే ఇతర ఉద్యోగులు, స్థానిక కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి మిగిలిన ఉద్యోగులందరినీ ఒకే వైపు వీధిలో నివాసం ఉండేలా చర్యలు చేపట్టి, శిథిలావస్థకు చేరిన క్వార్టర్లను కూల్చి ప్రాంగణాన్ని శుభ్రం చేయాలని కోరుతున్నారు.

ఆరేళ్లుగా సొంతంగా స్వచ్ఛభారత్ నిర్వహణ

- మన్ననలు పొందుతున్న కదంబాపూర్ మాజీ వార్డు సభ్యుడు



డ్రైనేజీలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సదయ్య

సుల్తానాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఆరేళ్లుగా ప్రతీ శుక్రవారం సొంతంగా స్వచ్ఛభారత్ నిర్వహిస్తూ, గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు మండలంలోని కదంబాపూర్ మాజీ వార్డు సభ్యుడు గోస్కుల సదయ్య. తన గ్రామంలో ప్రతీ శుక్రవారం స్వచ్ఛభారత్ నిర్వహిస్తూ గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా స్వయ్యంగా పరిసరాల పరిశుభ్రత కోసం కృషి చేయడంతో పాటు సొంత ఖర్చులతో డ్రైనేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు గ్రామస్తులకు బ్లీచింగ్ పౌడర్ అందజేస్తున్నాడు. దీంతో సదయ్యను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

ప్రజలు ఆరోగ్యం ఉండాలని..

పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. అందుకే ప్రతీ శుక్రవారం డ్రైడేను సొంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నా.

– గోస్కుల సదయ్య, మాజీ వార్డు సభ్యుడు

మొక్కలు నాటుదాం.. పచ్చదనం కాపాడుదాం



మొక్క నాటుతున్న భాగ్యలక్ష్మి

ఫెర్టిలైజర్‌సిటీ: ప్రతీ మనిషి తన జీవితంలో మొక్కలు నాటడం కూడా భాగం చేసుకోవాలని దీపం గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు భాగ్యాలక్ష్మి కోరారు. గ్రామగ్రామానికి వందమొక్కలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్ గౌతమినగర్‌లో వాకర్స్‌తో కలిసి ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కటారి రేవతిరావు హాజరై మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ మనిషి మొక్కలు నాటడంతో పాటు తోటి వారు నాటేలా వాటి ఆవశ్యకతను తెలియజేయాలని సూచించారు. వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు కృతజ్ఞతలు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం ముస్త్యాల మాజీ సర్పంచ్ లావణ్య ఆదివారం ఆర్జీ–1 ఏరియా జీఎం లలిత్ కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా మంత్రి జీఎంకు తెలిపారు. జీఎం స్పందించి వెంటనే గ్రామంలో మూడు బోర్లు మంజూరు చేసి సిబ్బందితో వేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల తరఫున మాజీ సర్పంచ్, కాంగ్రెస్ జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్ జీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

దహన సంస్కారాలకు సాయం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ కార్మికుడిగా పనిచేస్తున్న మామిడిపల్లి ప్రవీణ్ అనారోగ్యంతో ఆదివారం మరణించారు. పట్టణంలో నివాసముంటున్న ప్రవీణ్ దహన సంస్కారాల కోసం మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ ఆదేశాల మేరకు రూ.10వేల నగదు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, రాజకుమార్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో ఉచిత వైద్యశిబిరం

జ్యోతినగర్: శ్రీ భగవతీ యూత్ ఆధ్వర్యంలో సన్‌రైజ్ హాస్పిటల్ కరీంనగర్ సహకారంతో మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్లు దామోదర్, రమణి, సతీశ్, వెంకటేశ్ 335 మందికి చెకప్ చేసి ఉచితంగా మందులు అందించారు. శ్రీ భగవతీ యూత్ అధ్యక్షుడు కంకటి రవిగౌడ్, మాచిడి మహేందర్‌గౌడ్, ఒల్లాల సురేశ్, చంద్రయ్య, శ్రీనివాస్, రమేశ్, సలీం, తిరుపతి, రమేశ్, సాయి, గణేశ్, సాయినాథ్, రహీం, విజయ్, శ్రీకాంత్, దుర్గాప్రసాద్, సతీశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• శివాలయంలో రుద్రాభిషేకం

సుల్తానాబాద్: పట్టణంలోని పురాతన శివాలయంలో శ్రావణమాసం సందర్భంగా స్వామివారికి పలు రకాల పండ్లతో రుద్రాభిషేకం నిర్వహించి, అన్నపూజ నిర్వహించారు. ఆదివారం శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ ఉన్నారు.

• కేజ్‌వీల్స్ ట్రాక్టర్ సీజ్

కాల్వశ్రీరాంపూర్: నిబంధనలకు విరుద్ధంగా కేజ్‌వీల్స్‌తో రోడ్లపై నడిపిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను జరిమానా నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్డుపై నడపడం ద్వారా రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు ఎక్కితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

• రోడ్డు ప్రమాదంలో ఏఐటీయూసీ నాయకునికి గాయాలు

గోదావరిఖని: స్థానిక గంగానగర్ మిలీనియం క్వార్టర్స్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కలవేని రాజేశ్ అనే ఏఐటీయూసీ నాయకుడు ఆదివారం గాయపడ్డాడు. సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడిని ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, మానాల శ్రీనివాస్, నెరెళ్ల తిరుపతి, దేవేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్ పరామర్శించి సరైన వైద్యం అందించాలని కోరారు.

• పెద్దపల్లి బస్టాండ్‌లో ఉచిత వైద్యశిబిరం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు చేయడంతో ఇతర రకాల జబ్బులు గుర్తించి తగు సూచనలిచ్చారు. బస్టాండ్ మేనేజర్ రాంగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది కరుణాకర్, హరీశ్, శ్రీనివాస్ ఉన్నారు.

• మందకృష్ణకు చిత్రపటం బహూకరణ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం కొత్తపల్లికి చెందిన సామాజిక కార్యకర్త కనుకుంట్ల సదానందం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను కలిసి ఆయన చిత్రపటాన్ని బహూకరించారు.



కాలనీవాసులకు కుక్కల బెడద

సుల్తానాబాద్: మండల కేంద్రంలో పలుకాలనీల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్‌కి వెళ్లేటప్పుడు కాలనీవాసులు భయంభయంగా వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికే పలువురు కుక్క కాటుకు గురైనట్లు స్థానికులు చెప్తున్నారు. కుక్కల బెడద నుంచి కాపాడాలని కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు.

మంత్రిని కలిసిన మార్కెట్ కమిటీ పాలకవర్గం



మంత్రి శ్రీధర్‌బాబుతో మార్కెట్ కమిటీ పాలకవర్గం

మంథని: మంథని వ్యవసాయ మార్కెట్‌కి నూతనంగా నియామకమైన చైర్మన్ కుడుదుల వెంకన్నతో పాటు పాలకవర్గ సభ్యులు హైదరాబాద్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఐలి ప్రసాద్, ఆకుల కిరణ్, ఆరెల్లి కిరణ్, పర్శ మోహన్ ఉన్నారు.

క్లుప్తంగా

స్థానిక సమరంలో బీఆర్‌ఎస్‌దే విజయం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్‌రెడ్డి ధీమ వ్యక్తం చేశారు. పెద్దపల్లిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకుడు ముఖీం ఆధ్వర్యంలో పలువురు నాయకులకు బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. అంతకుముందు పట్టణంలో పార్టీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, నాయకులు చంద్రశేఖర్, వాసు, రవీందర్ పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న మిత్రులు

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ముద్రవేణి నరేశ్ ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. నరేశ్‌తో పాటు 2007–08లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు రూ.20వేలు మృతుని కుమారుడి పేరిట ఎఫ్‌డీ చేసి అందజేశారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

ఓదెల: మండలంలోని కనగర్తి దాసరి హన్మయ్య హైస్కూలు విద్యార్థులు హైదరాబాద్‌లో జరిగిన బాక్సింగ్ పోటీల్లో ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించారు. పిట్టల వర్షిత సిల్వర్ మెడల్, ముద్దమల్ల అజయ్, కొలిపాక అక్షర బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను జిల్లా క్రీడల అధికారి సురేశ్, ఎంఈవో ఎర్ర రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ విష్ణు అభినందించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం



కార్యశాలలో పాల్గొన్న నాయకులు

పెద్దపల్లిరూరల్: త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేందుకు గ్రామస్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల రమేశ్ కోరారు. పెద్దపల్లి మండలం సబ్బితంలో ఆదివారం ఎన్నికల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులతో సమావేశమై స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకుంటామనే ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రధాని మోదీ అందిస్తున్న నీతివంతమైన పాలనకే ప్రజలంతా అండగా నిలిచి మొగ్గుచూపుతున్నారన్నారు. నాయకులు కావేటి రాజగోపాల్, పడాల శ్రీధర్, శివయ్య, రేండ్ల వేణు, సదానందం, మహేందర్, సతీశ్, కిష్టయ్య, రాజమౌళి, కనకరాజు, సతీశ్, శ్రీకాంత్, శంకర్, సాయి, రాజు, హరిశంకర్, రాజేశ్, వెంకటాచారి ఉన్నారు.

ఆర్థికసాయం

మంథనిరూరల్: మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన వంగ సమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా ఆ కుటుంబానికి సమ్మయ్య స్నేహితులు ఆదివారం అతని కుటుంబాన్ని పరామర్శించి రూ.7,500 అందజేశారు. భవిష్యత్‌లో సమ్మయ్య పిల్లలకు తమవంతు సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. సమ్మయ్య మిత్రబృందం గుడిసె గట్టయ్య, ఊదరి శేఖర్, కాసిపేట ప్రభాకర్, శ్రీనివాస్, తిరుపతి, చొటపల్లి సుమార్, సాధుల తిరుపతి, గంప వెంకటేశ్వర్లు, రేగళ్ల పరీక్షిత్, ఎరవెల్లి సత్యంరావు ఉన్నారు.



జ్యోతినగర్: తాగునీటికి కోసం వేస్తున్న పైప్‌లైన్ మురుగునీటి కాలువకు అడ్డుగా వేయడంతో మురుగునీరు వెళ్లేందుకు దారేది అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్టీపీసీ రామగుండం సింధూర కళాశాల రోడ్డులో జంగాలపల్లె శివారులోని డబుల్‌బెడ్రూం ఇళ్లకు నీటి సరఫరా కోసం పైప్‌లైన్ నిర్మిస్తున్నారు. కాగా శ్రీమయి గ్యాస్ గోదౌన్ మూలమలుపు వద్ద ఉన్న డ్రైనేజీని పగలగొట్టి కాలువకు అడ్డంగా పైప్‌లైన్ వేయడంతో మురుగు నీరంతా నిలిచింది. కాలువకు అడ్డుగా పైపులైన్ వేయడంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, మురుగునీటికి అడ్డుగా ఉన్న పైప్‌లైన్ సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

కార్మిక కుటుంబాల సమస్యలు పరిష్కరించండి



సమస్యలు తెలుసుకుంటున్న రాజరెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా సింగరేణి కార్మిక కుటుంబాలు నివాసం ఉంటున్న ప్రాంతాల్లోని సమస్యలు యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజరెడ్డి కోరారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ, పోతనకాలనీ, సింగరేణి కార్మిక కుటుంబాలు నివాసం ఉంటున్న క్వార్టర్ల ఏరియాల్లో ఆదివారం నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. కార్మిక కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్న వాటికి తక్షణమే మరమ్మతు చేయాలని, క్వార్టర్ల పైకప్పు పెచ్చులుడి కార్మికులు గాయాలపాలవుతున్నారని వాపోయారు. క్వార్టర్ల రిపేర్ కోసం అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని కార్మిక కుటుంబాలు చెప్పడం బాధాకరమన్నారు. వెంటనే సింగరేణి ఆర్జీ–2 ఏరియాకు సంబంధించిన అధికారులు స్పందించి అన్ని ఏరియాల్లో క్వార్టర్లను పరిశీలించి మరమ్మతు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆర్జీ–2 సెక్రటరీ కుంట ప్రవీణ్‌కుమార్, వినయ్, వెంకన్న, సంపత్‌కుమార్, నర సింహ, రాంప్రసాద్, సంపత్, తిరుపతి, ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, రమేశ్, విజయ్‌కుమార్, కొమురయ్య, రాజేశ్ పాల్గొన్నారు.

సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: భారత కమ్యూనిస్టు మార్క్సిస్టు(సీపీఎం) జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం స్థానిక శ్రామికభవన్‌లో ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ శాఖల కార్యదర్శులకు రెండు రోజులపాటు రాజకీయ శిక్షణ తరగతులు కొనసాగనున్నాయి. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రవెల్లి ముత్యంరావు, జిల్లా కార్యదర్శి వై.యాకయ్య భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ చరిత్రపై వివరించారు. సోమవారం సీపీఎం పార్టీ నిర్మాణం, పార్టీ 24వ మహాసభ నిర్దేశం–కార్యాచరణపై నిర్వహించే వర్క్‌షాప్‌లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య దిశానిర్దేశం చేయనున్నట్లు వారు తెలిపారు. క్లాసులకు జిల్లా కమిటీ సభ్యులు ఎం.బిక్షపతి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. నాయకులు మహేశ్వరి, వేల్పుల కుమార్‌స్వామి, బి.గణేశ్, సారయ్య, నెర్వెట్ల నర్సయ్య, భాగ్యలక్ష్మి, జి.లక్ష్మారెడ్డి, టి.మల్లేశ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. డ్రైనేజీ మరిచారు





డ్రైనేజీ లేక ఇళ్ల మధ్య నిలిచిన వరద నీరు

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో తారురోడ్డు నిర్మించి ఇరువైపులా డ్రైనేజీ నిర్మించకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు తారురోడ్డు పక్కన మురికి నీరంతా నిలవడంతో గ్రామస్తులు కనీసం కాలినడకక వెళ్లేందుకు తిప్పలు పడుతున్నారు. రూ.కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన తారురోడ్డు ప్రస్తుతం కోతకు గురై చెడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇళ్లలోకి మురికినీరు రావటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మురికినీరంతా రోడ్డుపక్కన నిలిచి ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే డ్రైనేజీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి



మంథని: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి మంథనిలోని రాజగృహలో బీఆర్‌ఎస్ శ్రేణులు నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్, నాయకులు గొబ్బూరి వంశీ, పుప్పాల తిరుపతి, ఆసిఫ్, మాచిడి కృష్ణ, జనగామ సంతోష్, పోలు కనకరాజు పాల్గొన్నారు.

శ్రావణ్‌కుమార్‌కు వింగ్స్ ఆఫ్ ఫైర్ ఎక్సలెన్స్ అవార్డు



యైటింక్లయిన్‌కాలనీ: ఆరోగ్యమిత్ర లిబర్టీ ఫౌండేషన్, లీడ్ ఫౌండేషన్ గ్లోబల్ నిర్వాహకులు డాక్టర్ పరికిపండ్ల అశోక్, ఎంజేఎం రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం హన్మకొండ బాలవికాస్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్‌కు అవార్డు అందజేశారు. సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ సంస్థ ద్వారా నేత్ర, శరీర అవయవదానాలపై చేస్తున్న సేవలను గుర్తించి వింగ్స్ ఆఫ్ ఫైర్ ఎక్సలెన్స్ అవార్డు–25తో సత్కరించారు.